సాక్షి
కుమురం భీం
మంగళవారం । 30 । మే । 2023



పెన్షనర్లకు మొండిచేయి!
వేతన ఒప్పందంలో రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు మొండిచేయి ఎదురైంది. ఈ నెల 19, 20 తేదీల్లో కోల్‌కత్తాలో జేబీసీసీఐ-11 సమావేశాలు జరిగాయి. 8లో▸



రోడ్ల మీదే నిరీక్షణ..!
జిల్లాలో ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దంచి కొడుతున్న ఎండల్లో వాహనాల కోసం రోడ్లు, చెట్ల కిందే నిరీక్షిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
41.5 /28.9

వాతావరణం
ఉదయం ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత పెరుగుతుంది. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మున్సిపల్ కౌన్సిలర్ల నిరసన



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మిషన్ భగీరథ పథకం నీటి సరఫరాలో బల్దియా యంత్రాంగం విఫలయిందని సోమవారం పలువురు కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో తాగునీటి సరఫరాతోపాటు వివిధ రకాల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ఆరోపిస్తూ నేలపై బైఠాయించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ అంజయ్య.. త్వరలోనే తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కౌన్సిలర్లు నిరసన విరమించారు. మున్సిపల్ సమావేశంలో చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్ కుమార్, అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

'యువత భవితే కాంగ్రెస్ నినాదం'



కరపత్రం విడుదల చేస్తున్న విశ్వప్రసాద్

నార్నూర్(ఆసిఫాబాద్): యువత భవితే కాంగ్రెస్ నినాదం.. అమరుల ఆశయ సాధనే తమ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద యూత్ డిక్లరేషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ లింక్ పొందేందుకు 76618 99899 నంబర్‌కి మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే ప్రతీ నియోజకవర్గానికి 40 ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని వెల్లడించారు. 16 నుంచి 35 సంవత్సరాల వారు జూన్ 1 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, యాసుఫ్‌ఖాన్, జాక్రుల్లా ఖాన్, కై లాస్‌నాయక్, విలాస్ నాయక్, దేవరావు, సత్తార్, కార్తీక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్‌రావ్

నార్నూర్(ఆసిఫాబాద్): జైనూర్ మండలం మార్లవాయిలో సోమవారం టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావ్ గ్రామంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. సామాజిక సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం టీపీటీఎఫ్ మాత్రమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో ఉన్న న్యాయపరమైన సమస్యలు పరిష్కరించి, తక్షణమే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. నాయకులు మండడి సోనేరావ్, ఆ డ సెడ్మ రావ్, కనక సోనేరావ్, ఆత్రం జల్పత్ రావ్, కమల, మహేశ్వరి, ఇంద్రు, శ్యామ్‌రా వ్, హేమలత, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి'

కైలాస్‌నగర్: మంత్రి హోదాలో స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న దివ్యాంగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 2014లో మున్సిపల్ కార్యాలయం ఎదుట 113 రోజుల పాటు ధర్నా చేశామన్నారు. అప్పుడు మంత్రిగా ఉన్న జోగు రామన్న నూతన కాలనీ ఏర్పాటు చేస్తామని 2015లో తమకు రాతపూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. ఎనిమిదేళ్లు గడిచినా ఇప్పటికీ నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మృగాళ్ల పంజా



జిల్లాలో వరుస ఘటనలు

తల్లిగర్భం నుంచి బయటకొచ్చిన ఆడపిల్లకు ఈ సమాజంలో ఆది నుంచే రక్షణ లేకుండా పోతోంది. ఆటపాటలతో ఆనందంగా గడపాల్సిన పసిమొగ్గలపై మృగాళ్ల పైశాచికత్వాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో మైనర్లపై పెరుగుతున్న లైంగిక దాడులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. కఠిన చట్టాలు అమలవుతున్నా.. నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నా.. మహిళలు, చిన్నారులపై దాడులు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చట్టాలు, శిక్షలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముందని నిపుణులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇబ్బందికర పరిస్థితుల్లో ఎలా బయటపడాలో పిల్లలకు సరైన అవగాహన కల్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

– కౌటాల(సిర్పూర్)

- నిందితుల్లో ఎక్కువగా యువకులు
- చిన్నారులకు అండగా పోక్సో చట్టం
- కామాంధులపై కఠిన చర్యలు
- ఏటా పెరుగుతున్న దాడులు

క్షణికావేశం.. జీవితం నాశనం..
చాలా వరకు లైంగిక దాడులు క్షణికావేశం, మద్యం మత్తులోనే జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. నిందితుల్లో ఎక్కువగా యువకులే ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న సాంకేతికత, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, సినిమాల ప్రభావం వీరిపై అధికంగా ఉంటుందంటున్నారు. లాక్‌డౌన్ సమయంలో పాఠశాలలు లేకపోవడంతో ఆన్‌లైన్ క్లాసుల పేరిట సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు కొనివ్వడంతో యువకులు కొంత పక్కదారి పట్టారు. ఫోన్లలో అనవసర అంశాలపైనే పిల్లలు, యువకులు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. ప్రేమ పేరుతో, ఇతర వ్యామోహాలతో లైంగికదాడులకు పాల్పడుతున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

అండగా పోక్సో..
జిల్లాలో లైగింకదాడులు క్రమంగా పెరుగుతున్నాయి. వీటిలో కొన్ని వెంటనే వెలుగులోకి వస్తుండగా.. మరికొన్ని ఇతర కేసుల విచారణ సమయంలోనో, బాధితులు చనిపోయినప్పుడో బహిర్గతమవుతున్నాయి. పరువుపోతుందన్న భయంతో కొందరు తల్లిదండ్రులు ఇలాంటి సంఘటనలు దాచిపెడుతున్నారు. నిందితులు తెలిసినవారై ఉండటం, పోలీసులకు ఫిర్యాదు చేస్తే బయటకు వచ్చాక మళ్లీ వేధిస్తారన్న అనుమానంతో కొంతమంది ఫిర్యాదు చేయడం లేదు. దేశంలో మహిళలు, బాలికలకు అండగా అనేక చట్టాలు అమలవుతున్నాయి. 18 ఏళ్లలోపు వారిపై జరిగే అత్యాచారాలు, అత్యాచారయత్నాలపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నారు. ఈ చట్టం ప్రకారం అత్యాచారం, వేధింపులకు పాల్పడితే కనీసం మూడేళ్లకు తగ్గని జైలు శిక్ష నుంచి అత్యధికంగా జీవితఖైదు, దీనికి తోడు అవసరమైతే జరిమానా కూడా విధిస్తారు. కఠిన చట్టాలు అమలవుతున్నా కేసుల సంఖ్య ఏటా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

అప్రమత్తత అవసరం

- తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. పిల్లలను ఒంటరిగా వదలకుండా ఎవరో ఒకరు కనిపెట్టుకుని ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల ప్రవర్తనలో ఏమైనా తేడా వస్తే గమనించి, దానికి గల కారణాలను తెలుసుకోవాలి. పిల్లలను పాఠశాల, కళాశాలలకు పంపినప్పుడు వాళ్లు అక్కడికి చేరుకున్నారో? లేదో విచారించుకోవాలి.
- పిల్లలకు తమ శరీరంలో ఉన్న కొన్ని సున్నితమైన భాగాలను ఎవరైనా తాకడానికి ప్రయత్నిస్తే ఎలా ప్రవర్తించాలో వివరించాలి. ఆడపిల్లలకు అవసరమైతే ఆత్మరక్షణకు కరాటే, కుంగ్‌ఫూ వంటివి నేర్పించాలి. ఇంట్లోని మగ పిల్లలకు తోటి పిల్లలు, చుట్టూ ఉన్న మహిళలు, బాలికలను ఏవిధంగా గౌరవించాలో తెలియజేయాలి.
- పిల్లలతో రోజూ కొంత సమయం గడుపుతూ వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం చేయాలి. చాలా కేసుల్లో నిందితులు తప్పు చేస్తే కఠిన శిక్షలు పడుతాయని కూడా తమకు అవగాహన లేదని చెబుతుండడం గమనార్హం. చట్టాల అమలుతో పాటు ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు

- జనవరి 13న కౌటాల మండలంలోని వీర్దండి గ్రామానికి చెందిన బాలిక(9) ఇంటి వద్ద ఒంటరిగా ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైగింక దాడికి పాల్పడ్డాడు.
- ఏప్రిల్ 18న దహెగాం మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బాలిక(16) గ్రామ సమీపంలోని ఒర్రె వద్దకు నీళ్లు తేవడానికి వెళ్లగా గమనించిన అదే గ్రామానికి చెందిన అనిల్ పుల్లూర్‌వార్ అనే వ్యక్తి లైంగిక దాడి చేశాడు.
- ఈ నెల 8న జిల్లాలోని కాగజ్‌నగర్ మండలంలోని ఓ గ్రామంలో ఏడేళ్ల బాలికపై 54 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఆడుకుంటున్న సమయంలో రమేశ్ అనే వ్యక్తి కర్రతో బాలికను బెదిరించి బాత్‌రూంలోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. కాలనీవాసులు గమనించి రమేశ్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు.
- చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన సంజయ్ బిశ్వాస్ అనే యువకుడు ఈనెల 13న ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్‌కి చెందిన ఓ బాలిక (14)పై అత్యాచారానికి యత్నించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఈ నెల 15న తెలిపారు.

పిల్లల భద్రతపై దృష్టి పెట్టాలి



ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో పిల్లలు పక్కదారి పడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ వంటి విషయాల్లో పిల్లలకు అవగాహన కల్పించాలి. పిల్లల్ని ఒంటరిగా ఉంచవద్దు. బాలికల రక్షణ చట్టాలపై కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– బూర్ల మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లాలోని 15 మండలాలకు చెందిన అర్హులకు త్వరగా డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలు ప్రతిరోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఇళ్ల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హుల దరఖాస్తులను తిరస్కరిస్తే పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి లోకేశ్, ఆదె కమల, తానుబాయి, సుగుణ, వసంత, సావిత్రిబాయి, లక్ష్మి, శోభ, మంజుల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ, ఎస్పీఎం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని జీడిచేను గ్రామంలో పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగించడంతో జరిగే అనర్థాల గురించి వివరించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్తబండిలో వేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం ప్రతినిధి తుమ్మ రమేశ్, పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ ప్రతినిధులు వినల్, సుశీల, పంచాయతీ కార్యదర్శి వాజిద్, నాయకులు పిర్సింగుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరు నెలలు చాన్స్

- పాఠశాల యాజమాన్య కమిటీల గడువు పొడిగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- జిల్లాలో ప్రస్తుతం 1,071 మంది ఎస్‌ఎంసీ చైర్మన్లు
- డిసెంబర్‌లో నూతన కమిటీలు ఏర్పాటయ్యే అవకాశం



ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)లను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లు, సభ్యులుగా కొనసాగే ఈ కమిటీ పదవీకాలం పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసిన ముగుస్తుంది. అత్యవసర సమయంలో తాత్కాలిక కమిటీలు కొనసాగుతాయి. అనంతరం వారి స్థానంలో కొత్త సభ్యులు, చైర్మన్లు ఎన్నుకుంటారు. ప్రభుత్వం ఉత్తర్వులతో ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్‌ఎంసీలు మరో ఆరు నెలలపాటు కొనసాగనున్నాయి.

జిల్లాలో 1,071 మంది చైర్మన్లు..
జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 1,071 పాఠశాలలకు ఎస్‌ఎంసీలు ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ సభ్యులుగా ఉంటారు. వీరు చైర్మన్‌తోపాటు వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాల యాజమాన్య కమిటీ పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. దీంతో ప్రభుత్వం వీరి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నవంబర్ 30 వరకు ఈ కమిటీలు కొనసాగనున్నాయి.

మన ఊరు– మన బడి పనుల కోసమే..!
ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మన ఊరు– మన బడి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మొదటి విడతలో భాగంగా జిల్లాలో 251 పాఠశాలలు ఎంపిక అయ్యాయి. ఇందులో 30 పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఎస్‌ఎంసీ చైర్మన్లు, సభ్యుల తీర్మానాలతో బడుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మధ్యాహ్న భోజనంతోపాటు ప్రతీ సంక్షేమ పథకం అమలు పర్యవేక్షణ బాధ్యతలు కూడా ఎస్‌ఎంసీలపై ఉన్నాయి. మన ఊరు– మన బడి కార్యక్రమం పనులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎస్‌ఎంసీల గడువును పొడిగించినట్లు తెలుస్తోంది.

ఉత్తర్వులు అందాయి



ఎస్‌ఎంసీ చైర్మన్ల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ ఏడాది నవంబర్ వరకు ప్రస్తుత కమిటీలే కొనసాగుతాయి. ఎస్‌ఎంసీలో సభ్యులుగా కొనసాగలంటే వారి పిల్లలు తప్పనిసరిగా ఆ పాఠశాలలో చదువుతూ ఉండాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్‌లో కొత్త కమిటీల ఎంపిక ఉంటుంది.

– జంబోజు సత్తయ్య, జిల్లా సెక్టోరియల్ అధికారి

పండుగలా దశాబ్ది ఉత్సవాలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- సీఎస్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జిల్లా అధికారులు

సాక్షి, ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహిస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జూన్ 2 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలను విజయవంతం చేయాలంటూ సీఎస్ శాంతికుమారి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పతాకావిష్కరణ, అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం జిల్లా అభివృద్ధిపై ముఖ్య అతిథితో ఉపన్యాస కార్యక్రమం ఉంటుందని వివరించారు. జూన్ 2 నుంచి 22 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు, రైతులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, తర్వాత జరిగిన అభివృద్ధిని వివరిస్తామన్నారు. జూన్ 3న జిల్లాలోని 70 రైతు వేదికల వద్ద రైతులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, రైతుబంధు, రైతుబీమా, ఇతర సంక్షేమ పథకాలను వివరిస్తూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని తెలియస్తామని వివరించారు. అనంతరం ప్రతి రైతు వేదిక వద్ద దాదాపు 1000 మందికి పైగా రైతులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ రైతు వేదికకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, ఎస్పీ సురేశ్‌కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేటాయించిన విధులను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వర్తించాలన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీసు అధికారులు, అధికారులతో రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. 21 రోజు లపాటు కొనసాగే దశాబ్ది ఉత్సవాలను కార్యాచరణ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు.

ఉత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఒడ్డేపల్లి గార్డెన్‌లో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ హేమంత్ బోర్కడే సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పతో కలిసి జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించే కార్యక్రమాల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించారు. ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజాసంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. 21 రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో రాజేశ్వర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఇన్‌చార్జి డీఆర్వో రాజేశ్వర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌కు చెందిన మండల్ ప్రభాస్ పట్టా భూమికి ఎంసీతో కొలతలు తీయించి, హద్దులు గుర్తించాలని దరఖాస్తు చేసుకున్నాడు. రైతుబంధు వర్తింపజేయాలని కెరమెరి మండలం సాంగ్వికి చెందిన మడావి భీంబాయి విన్నవించింది. కౌటాల మండలం కన్నెపల్లికి చెందిన పంచాయతీ కార్యదర్శి విధులకు హాజరుకాకుండా, జీపీ నిధులు దుర్వినియోగం చేస్తున్నాడని సర్పంచ్ మోర్లె రమేశ్ ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరాడు. గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని ఆసిఫాబాద్ మండలం రాజంపేటకు చెందిన శ్యామల దరఖాస్తు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం కులవృత్తుల వారికి ప్రకటించిన ఆర్థిక సాయం రూ.10లక్షలకు పెంచాలని రజక సంఘం నాయకులు తులసీదాస్, రాజేందర్, పలువురు నాయకులు కోరారు. వాంకిడి మండలం బోర్డా శివారులో సర్వే నంబర్ 69లోని 1,200 ఎకరాల రెవెన్యూ భూమి ధరణి పోర్టల్‌లో అటవీ భూమికి నమోదైందని గ్రామానికి చెందిన గుర్నెలె ఆనంద్‌రావు, మోర్లె తిరుపతి తెలిపారు. సదరు భూమిని తిరిగి రెవెన్యూ భూమికిగా మార్చాలని ఇన్‌చార్జి డీఆర్వోకు విన్నవించారు. వీరితోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు.

దశాబ్ది ఉత్సవాలతో ఒరిగేదేమీ లేదు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.105 కోట్లతో జూన్ 2 నుంచి జరిపే ఉత్సవాలు బీఆర్‌ఎస్ ఉత్సవాలుగా అభివర్ణించారు. ఏం సాధించారని తెలంగాణ సంబరాలు జరుపుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అమరవీరుల ఆకాంక్షలు నెరవేర్చలేని కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని పల్లెల్లో సంబురాలు జరుపుతారని ప్రశ్నించారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలో నిందితులను అరెస్ట్ చేసిన ప్రభుత్వం.. లీకేజీకి సూత్రధారులైన కమిషన్ చైర్మన్‌ను ఎందుకు అరెస్టు చేయలేదని మండిపడ్డారు. టీఎస్పీఎస్సీ కమిషన్ రద్దు చేసిన తర్వాతే గ్రూప్– 1 ప్రాథమిక పరీక్ష నిర్వహించాలన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్సీ కవితను ఎందుకు అరెస్టు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రహస్య కూటమితో వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్నాయని తెలిపారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రాజ్యాధికారమే లక్ష్యం..
కౌటాల(సిర్పూర్): రాష్ట్రంలో రాజ్యాధికారమే తమ లక్ష్యమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కౌటాల మండలం గుండాయిపేట గ్రామంలో నూతనం ఏర్పాటు చేసిన బుద్ధ విహార్‌ను సోమవారం రాత్రి ప్రారంభించారు. అలాగే నూతన బుద్ధుడి విగ్రహాన్ని చంద్రపూర్‌కు చెందిన భదంత్ సుమాన్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్, బుద్ధుడి మార్గంలో నడవాలని సూచించారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షులు మాయవతి నిర్ణయిస్తే సిర్పూర్ నుంచి పోటీ చేస్తానని తెలిపారు. అంతకు ముందు శివాజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా కార్యదర్శి దుర్గం ప్రవీణ్ కుమార్, సర్పంచ్ అన్వర్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు నక్క మనోహర్, నాయకులు వాను పటేల్, రాజేందర్‌గౌడ్, మోతీరాం, యశ్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి


అమ్మబాయి మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని అంకుసాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టాక్రె అమ్మబాయి (67) సోమవారం ఇంటిముందు పందిరికి ఉన్న చిక్కుడు తీగను కొడవలితో కోస్తున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ సర్వీసు వైరును కట్ చేసింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని రూరల్ ఎస్సై సోనియా తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఎల్లయ్య (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ కొత్త రోడ్డుకు చెందిన టెంట్ హౌస్ నిర్వాహకుడు ఎర్ర ఎల్లయ్య (53) హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఈ నెల 7న తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఎల్లయ్య తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించారు.

బుయ్యారం గ్రామానికి చెందిన విద్యార్థి..

వేమనపల్లి: పదిరోజుల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని బుయ్యారం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని అనూష(18) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. గ్రామానికి చెందిన కొండగొర్ల శంకరయ్య–శారద దంపతుల కుమార్తె అనూష హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. కడుపునొప్పి భరించలేక పదిరోజుల క్రితం పురుగుల మందు తాగగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. కడుపునొప్పి, డిగ్రీలో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో మనస్థాపంతో ఆత్మహత్యకు యత్నించిందని మృతురాలి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నీల్వాయి ఎస్సై సుబ్బారావు తెలిపారు.

'యాదవులకు అండగా ప్రభుత్వం'


మాట్లాడుతున్న అశోక్‌యాదవ్

భీమారం: యాదవుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అండగా నిలుస్తోందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. మండలంలోని కాజిపల్లి గ్రామంలో సోమవారం గొర్రెల పెంపకంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ యాదవులతోపాటు కుర్మ కులస్తులకు సబ్సిడీపై గొర్రెలు అందిస్తున్నారని తెలిపారు. జూన్ 9 రెండో విడత పంపిణీ ప్రారంభించనుందని తెలిపారు. జీవాలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పశుసంవర్ధక వైద్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు.

పెన్షనర్లకు మొండిచేయి!

- నూతన వేతన ఒప్పందంలో రిటైర్డ్ ఉద్యోగుల ఊసే లేని వైనం
- కలగానే కాంట్రాక్టు కార్మికుల ఫస్ట్ కేటగిరీ వేతనాలు
- తమ డిమాండ్లు పట్టించుకోలేదని రెండు వర్గాల ఆవేదన



పెన్షన్ కోసం ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేతన ఒప్పందంలో రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు మొండి చేయే ఎదురైంది. ఈ నెల 19, 20 తేదీల్లో కోల్‌కత్తాలో జేబీసీసీఐ–11 సమావేశాలు జరిగాయి. ఇందులో బొగ్గు గని కార్మికులకు సంబంధించిన జీతభత్యాలు, అలవెన్స్ తదితర అంశాలపై ఒప్పందం జరిగింది. దేశ వ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో ఉన్న సుమారు మూడు లక్షల ఇరవై వేల మంది కార్మికులకు ఈ ఒప్పందంతో ప్రయోజనం చేకూరింది. అయితే దేశ వ్యాప్తంగా వీరితో పాటు రెండు లక్షల మంది రిటైర్డ్ ఉద్యోగులు, మరో లక్ష మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి సంబంధించిన ప్రధాన డిమాండ్లు ఈ చర్చల్లో ఒప్పందానికి నోచుకోలేదు. వేతన ఒప్పందంలో తమను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

25 శాతం పెన్షన్ ఇక పెరగదా?

రిటైర్డ్ ఉద్యోగులు 25 ఏళ్లుగా తమ పెన్షన్ పెంపుదల కొరకు ఎదురుచూస్తున్నారు. 1998లో పెన్షన్ చట్టం అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక శాతం కూడా పెన్షన్ పెరగలేదు. మొదటి నుంచి రిటైర్డ్ అయ్యేనాటికి వచ్చే బేసిక్ జీతంపై 25 శాతం పెన్షన్ చెల్లిస్తువస్తున్నారు. దీంతో 8వ వేజ్‌బోర్డుకు ముందు రిటైర్డ్ అయిన వారికి మూడంకెలకు మించి పెన్షన్ రావడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ వేతన ఒప్పంద చర్చల్లో 35 శాతం పెన్షన్ పెంచాలని డిమాండ్ పెట్టినా ఒక్క శాతం పెరుగలేదని వాపోతున్నారు. ఇదిలా ఉంటే పెన్షన్ నిధి పూర్తిగా అడుగంటి పోయిందని, దీని రక్షించుకొంటేనే ఇచ్చే 25 శాతం పెన్షన్ ఐన వస్తుందని లేకుంటే అది కూడా పోయే ప్రమాదం ఉందని జాతీయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఈ నిధిని పెంచడం కోసం గత 10వ వేతన ఒప్పందంలో టన్ను బొగ్గు అమ్మకంపై రూ.5 పెన్షన్ నిధికి కంపెనీలు జమ చేయాలని ఒప్పందం చేసుకుంటే ఇప్పుడు దాన్ని రూ.15కు పెంచామని లేకుంటే ఈమాత్రం పెన్షన్ కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. పెన్షన్ నిధిలో నిధులు లేని కారణంగా పెన్షన్ శాతం పెంచడం కష్టసాధ్యంగా ఉందని ఓ జాతీయ సంఘం నేత తెలిపారు. పదవి విరమణ అనంతరం లభించే గ్రాట్యుటీ అధికారులకు 2017, జూన్ నుంచి రూ.20 లక్షలు చెల్లిసేత్ కార్మికులకు 2018 ఏప్రిల్ నుంచి అమలు చేయడం వల్ల అంతకు ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2017 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒకటో కేటగిరీ పట్టించుకోలేదు

ఈ వేతన ఒప్పంద చర్చల్లో తమ ప్రధాన డిమాండ్ ఒకటో కేటగిరీని జాతీయ సంఘాల నేతలు పట్టించుకోలేదని కాంట్రాక్ట్ కార్మికులు వాపోతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును యజమాన్యాలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైపవర్ కమిటీ వేతనాల అమలుపై ఒప్పందం చేసుకున్నామని, దీని వల్ల కాంట్రాక్ట్ కార్మికులకు చాలా మేలు జరుగుతుందని జాతీయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా ఈ చర్చల్లో తమను చిన్నచూపే చూశారని వారు వాపోతున్నారు.

మళ్లీ అన్యాయం..

ఈ వేతన ఒప్పందంలో కూడా రిటైర్డ్ కార్మికులకు అన్యాయం జరిగింది. రెక్కలు ముక్కలు చేసుకుని 40 ఏళ్లు కంపనీలో పనిచేసిన. దిగిపోయిన తరువాత వచ్చే 25 శాతం ఉన్న పెన్షన్‌తో ఇల్లు గడవడం ఇబ్బందిగా ఉంది. మందులకు డబ్బులు చాలడం లేదు. 7వ వేజ్‌బోర్డు సమయంలో దిగిపోయిన వారికి కనీసం వెయ్యి కూడా పెన్షన్ రావడం లేదు. పెన్షన్ నిధిని పెంచి రిటైర్డ్ ఉద్యోగులకు 35 శాతం పెన్షన్ పెంచాలి.

– పెద్దపల్లి కోటిలింగం, రిటైర్డ్ ఉద్యోగి

జిల్లావాసికి ఎన్టీఆర్ అవార్డు


మురళీమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బాపు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని మాదారం టౌన్‌షిప్‌కు చెందిన సినీ గేయరచయిత తైదల బాపు ఎన్టీఆర్ లెజండరీ అవార్డు అందుకున్నారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఎఫ్‌టీపీసీ ఇండియా, తెలుగు సినిమా వేదిక నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

వేజ్‌బోర్డ్ ఒప్పందం అమలు చేయాలి


మాట్లాడుతున్న నాగరాజ్‌గోపాల్

మందమర్రిరూరల్(చెన్నూర్): వేజ్‌బోర్డ్ ఒప్పందం అమలుకానిపక్షంలో బొగ్గుగని కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజ్‌గోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలతో జరిగిన ఒప్పందం కంటే బొగ్గుగని కార్మికుల వేజ్‌బోర్డ్ ఒప్పందం మెరుగైందన్నారు. సమావేశంలో నాయకులు మేడి రాజమల్లు, వెంకటస్వామి, రాజేందర్, సంజీవ్, ఆరీఫ్, శ్రీనివాస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు


మాట్లాడుతున్న సమ్మయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు రానున్నాయని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డులో హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించేలా ఒప్పందం జరిగిందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల కోసం తమ యూనియన్ మొదటి నుంచి పోరాటాలు చేస్తుందని, ఫలితంగా నేడు బ్యాంకుల ద్వారా వేతనాలు, సీఎంపీఎఫ్ చీటీలు తదితర హక్కులు, సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. జూన్ 4న కొత్తగూడెంలో జరిగే మహాగర్జన కార్యక్రమానికి అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మండల కార్యదర్శి డి.రవీందర్, యూనియన్ బ్రాంచ్ సహ కార్యదర్శి గునిగంటి నరసింహారావు, నాయకులు రాజు, ప్రభాకర్, సమ్మయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ


దుస్తులు అందిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్: వేసవి క్రీడా శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు సింగరేణి డైరెక్టర్(పర్సనల్) యన్ బలరాం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో కొద్ది రోజులుగా వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ ముగింపు కార్యక్రమానికి డైరెక్టర్ బలరాం హాజరై దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందం సాధించాం

- సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి


శ్రీరాంపూర్(మంచిర్యాల): 11వ వేజ్‌బోర్డులో బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధించామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే 7 గనిపై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. బొగ్గు గని కార్మికుల వేతన ఒప్పందం కోసం తమ సంఘం చేసిన పోరాటం ఫలితంగానే నేడు వేతనాలు పెరిగాయన్నారు. 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్స్ 25 శాతం అలవెన్సుల పెంపు వల్ల కార్మికుల జీతాలు మెరుగ్గా పెరుగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కార్మికులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని, 2011లో ఆర్ఎల్‌సి సమక్షంలో చేసుకున్న ఒప్పందాలను సింగరేణి యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు కోసం తమ సంఘం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, ఉపాధ్యక్షుడు గొల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ శ్రీనివాస్, బోడకుంట శంకర్, గంగాధర చారి, అశోక్, పిట్ సెక్రెటరీ శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకపై డైరెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న డైరెక్టర్ బలరాం

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో జూన్ 2, 5 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ సంబరాలపై సింగరేణి డైరెక్టర్(ఫైనాన్స్, పా) బలరాం ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ సాధించిన ప్రగతిని తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏరియా జీఎం మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులపై నిఘా


అంతర్రాష్ట్ర వంతెనపై తనిఖీలు చేపట్టిన ఏసీపీ నరేందర్

కోటపల్లి: మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులపై నిఘా పటిష్ఠం చేసినట్లు ఏసీపీ నరేందర్ తెలిపారు. సోమవారం రాపన్‌పల్లి వద్ద ప్రాణహిత నది అంతర్రాష్ట్ర వంతెనపై వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాణహిత మీదుగా ప్రయాణించే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతోపాటు అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. వాహనదారులు తప్పనిసరిగా పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ విద్యాసాగర్, ఎస్సైలు వెంకట్, సుబ్బారావు, పోలీసులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య

చింతలమానెపల్లి: తండ్రి మందలించాడని మనస్థాపంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రవీంద్రనగర్‌కు చెందిన కరణ్ బిశ్వాస్(17) కొంతకాలంగా చదువు మానేసి ఖాళీగా ఉంటున్నాడు. తండ్రి గౌర్ బిశ్వాస్ చదువుకోవాలని కుమారుడిని మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన ఒప్పందమని మోసం చేస్తున్నారు

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేజ్‌బోర్డులో మెరుగైన వేతన ఒప్పందం చేశామని మూడు జాతీయ సంఘాల నేతలు కార్మికులను మోసం చేస్తున్నారని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చర్చల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ కోలిండియా యాజమాన్యంతో గట్టిగా కొట్లాడలేదన్నారు. పదో వేతన ఒప్పందం కంటే ఈసారి ఎలా మెరుగ్గా సాధించారో ఆ సంఘాల నేతలు కార్మికులకు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. సింగరేణిలో మెడికల్ బోర్డు డిప్యూటేషన్ల అవినీతిపై ఏఐటీయూసీ నేతలు ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షుడు జే.నారాయణ, కేంద్ర ఉపాధ్యక్షులు వి.అనిల్‌రెడ్డి, తిప్పారపు సారయ్య, నాయకులు గొల్ల సత్తన్న, కొమురయ్య, సందీప్, అశోక్ తన్వీర్, కిరణ్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'గిరి'పల్లెలకు మిషన్ భగీరథ నీరు


గోండుగూడలో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీళ్లు


గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్

- కదిలిన అధికారులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గూడేలు, తండాల్లో తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న కష్టాలపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన 'దాహం తీర్చని భగీరథ' కథనానికి అధికారులు స్పందించారు. ఉదయం 8 గంటల నుంచే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేశారు. సర్పంచ్ జాదవ్ జిజాబాయి ప్రేమ్ సింగ్ గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తండా, కొలంగూడ, గోండుగుడాలకు సరిపడా నీటిని సరఫరా చేశారు. సుంగాపూర్ సమీపంలో ఉన్న వాగుపై నీటి నిల్వ కోసం చిన్న ప్రాజెక్టు మంజూరు చేయాలని ఆమె అధికారులను కోరారు. 'సాక్షి'లో వచ్చిన కథనంతో దాహార్తి తీర్చడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

నీటి కొరత తీర్చిన అధికారులు

బోథ్: 'దాహం తీర్చని భగీరథ' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయమే నాగాపూర్ గ్రామాన్ని సందర్శించి బావిలో ఉన్న నీటిని పరిశీలించారు. బోరు ద్వారా నీటిని మిషన్ భగీరథ ట్యాంకులో నింపారు. దీంతో గ్రామస్తులకు నీరు అందనుంది. గతంలో నీటిని ఓపెన్ బావిలో నింపడం వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. మిషన్ భగీరథ ట్యాంకులో నీటిని నింపడంతో గ్రామంలో నీటి కొరత తీరనుంది. గ్రామంలో నీటికొరత ఉండనివ్వమని ఎంపీవో జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో కోళ్ల సంరక్షణకు చర్యలు


ఫాంలో బాయిలర్ కోళ్లు..

దండేపల్లి(మంచిర్యాల): వేసవిలో మండుతున్న ఎండలకు వేడిని తట్టుకోలేక పశువులు, కోళ్లు విలవిలలాడుతున్నాయి. బాయిలర్, లేయర్ కోళ్లు సైతం ఎండ వేడిని తట్టుకోలేక పోతున్నాయి. వేసవిలో కోళ్ల పెంపకందారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యాధికారి ధన్‌రాజ్ పౌల్ట్రీ రైతులకు పలు సూచనలు చేశారు.

- కోళ్లఫాం షెడ్డుపై తుంగ, లేదా వరిగడ్డి కప్పాలి. చుట్టూ గోనెసంచులతో పరదలు కట్టి నీటితో తడుపుతూ ఉండాలి. ఉష్ణోగ్రతలను బట్టి ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే బాయిలర్ కోళ్లలో బరువు పెరగకపోవడం, లేయర్ కోళ్లలో గుడ్ల ఉత్పత్తి తగ్గడం జరుగుతుంది. ప్రతికూల పరిస్థితులతో కొన్ని సందర్భాల్లో చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.
- కోళ్ల షెడ్డులో రెండు ఇంచుల మందంతో ఉనుక, లేదా లిట్టర్‌ను ఉంచాలి. రోజుకు రెండు మూడు సార్లు లిట్టర్‌ను తిరగేయాలి. కోళ్లు తిరిగేందుకు షెడ్డులో సరైన స్థలం ఉండాలి. గుమిగూడకుండా విడివిడిగా ఉండేలా చూడాలి.
- కోళ్లకు ఉదయం సాయంత్రం దాణా అందించాలి. ఎండ వేడిమితో దాణ తీసుకోవడం తగ్గుతుంది. బలవర్ధకమైన దాణా అందించాలి. అందులో 20 నుంచి 30 శాతం అధికంగా ఖనిజ లవణాలు ఉండాలి. ఒక టన్ను దాణాలో విటమిన్ సీ–200 నుంచి 500 గ్రాములు కలపాలి. విటమిన్–ఈ, సెలినియం మిశ్రమాన్ని టన్నుకు 200 గ్రాముల చొప్పున కలపాలి. కోళ్లు నోటి ద్వారా శ్వాస తీసుకోవడంతో శరీరంలో బైకార్బనేట్ శాతం పడిపోతుంది. కాబట్టి టన్ను దాణాలో కిలో సోడియం కార్బనేట్‌ను కలిపి అందించాలి.
- వేసవిలో చల్లని తాగునీటిని అందించాలి. నీళ్లు వేడికాకుండా ట్యాంకర్లకు గన్నీ సంచులను కప్పి నీటితో తడపాలి. నీళ్లలో ఆక్వా క్లూర్‌ను కలిపితే వ్యాధులను నివారించవచ్చు. ఎలక్ట్రోలైట్స్‌ను మోతాదుకు తగ్గకుండా, లీటరు నీటిలో రెండు గ్రాముల ఎలక్ట్రాల్ కలపాలి.

బర్త్‌డేకు వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి


రవితేజ (ఫైల్)

మంచిర్యాలక్రైం: స్నేహితుని పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై తైసినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గర్‌కు చెందిన నల్లూరి అర్జయ్య, సుజాత దంపతుల పెద్ద కుమారుడు రవితేజ(21) స్థానిక శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి రామకృష్ణాపూర్‌లో ఉంటున్న మరో స్నేహితుని పుట్టినరోజు వేడుకలకు వెళ్లాడు. వేడుకల అనంతరం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా జిల్లా కేంద్రంలోని లక్ష్మీటాకీస్ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న సర్కిల్‌కు ఢీకొని కిందపడిపోయాడు. మరో బైక్‌పై వస్తున్న అతని స్నేహితులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి అర్జయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

నిరుపేదల ఆరోగ్య ప్రదాత కేసీఆర్

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న విప్ సుమన్

చెన్నూర్: నిరుపేదలకు ఆరోగ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని, నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసి ఆరోగ్య ప్రదాతగా సీఎం కేసీఆర్ నిలిచారని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గంలోని 104 మందికి రూ.43.87 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు అంబరాన్ని అంటాలి

చెన్నూర్ నియోజకవర్గంలో దశాబ్ది ఉత్సవాలు అంబరాన్ని అంటేలా నిర్వహించాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఐదు మండలాల దశాబ్ది ఉత్సవాల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. వేడుకల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేలా చూడాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆదిలాబాద్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన కుమ్రం మోతీరాం స్వయం ఉపాధి కోసం బొలెరో వాహనం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం శ్యాంనాయక్ తండాకు చెందిన ఆడే సంతోశ్ కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు నీటి వసతులు కల్పించాలని, పెంబి మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన విజయ్ కుమార్ భూమి పట్టా మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు.